


www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

మంగళవారం | 02 | జూన్ | 2026 | పేజీలు: 08


# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం**

**కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు, అక్షిత న్యూస్:** ప్రజావాణిలో ప్రజల నుంచి అందుతున్న అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ..మిగతా 2లో

# జనగణన దేశ ప్రగతికి పునాది



**పారదర్శకంగా జనగణన**

**జనగణన-2027 తొలి దశ ఇంటి జాబితా, గృహ గణన ప్రక్రియను వేగవంతం చేయాలి**

**కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి, అక్షిత బ్యూరో :** భారత ప్రభుత్వం చేపడుతున్న జనగణన--2027 కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న తొలి దశ ఇంటి జాబితా,గృహ గణన ప్రక్రియను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జనగణన కార్యక్రమ పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, జిల్లాలో జరుగుతున్న గృహ గణన పనులపై సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు పునాది వంటిది. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రతి గృహాన్ని సందర్శించి, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలి. ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారం పూర్తిస్థాయిలో సేకరించడంతో పాటు ఎలాంటి పొరపాట్లు ..మిగతా 2లో

# పచ్చదనం పరిఢవిల్లాలి

**మొక్కలు నాటాలి సంరక్షించాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**రాజన్న సిరిసిల్ల, అక్షిత బ్యూరో :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని.. వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.లిప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలి 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూన్ 1 వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు పర్యావరణ ఉత్సవాలలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమీపంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ సత్యనారాయణ, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, జిల్లా అధికారులు ..మిగతా 2లో

# లక్ష్య సాధన దిశగా "జల్ సంచయ్ జల్ భాగీదారి"

**కలెక్టర్ చంద్ర శేఖర్**




**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :** "జల్ సంచయ్ జల్ భాగీదారి" కార్యక్రమంలో నల్గొండ జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను అభినందించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆయన ..మిగతా 2లో

# పర్యావరణంను పరిరక్షించుకుందాం

**జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు**

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ..మిగతా 2లో

## జనగణన దేశ ప్రగతికి పునాది



**మొదటి పేజీ తరువాయి...**

లేకుండా అత్యంత జాగ్రత్తతో విధులు నిర్వహించాలి" అని సూచించారు. అలాగే, "గణన ప్రక్రియలో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలి. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి సర్వేను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి" అని ఆదేశించారు.జిల్లాలోని అన్ని మండలాల్లో గృహ గణన ప్రక్రియను మరింత వేగవంతం చేసి, వందకు వంద శాతం చేరుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి





**మొదటి పేజీ తరువాయి...**

జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 100 దరఖాస్తులు అందాయి. వాటిలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించిన 25 దరఖాస్తులు, సామాజిక భద్రతా పెన్షన్లకు సంబంధించిన 37 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించిన 38 దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమైన సేవా వేదిక అని అన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై నమ్మకంతో వినతులు సమర్పిస్తున్నందున ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో చొరవ చూపాలని పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీపై నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ పరిష్కార ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతిని పారదర్శకంగా, సమర్థవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు సకాలంలో న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, ఇన్‌చార్జి ఆర్డీవో ప్రతాప్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్య సాధన దిశగా "జల్ సంచయ్ జల్ భాగీదారి"

**మొదటి పేజీ తరువాయి...**



వివిధ అంశాలపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా "జల్ సంచాయ్ జన్ బాగిదారి" కార్యక్రమం కింద జిల్లాలో లక్ష 50 వేల పనులు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించగా, లక్ష ఇరవై తొమ్మిది వేల పనులను పూర్తి చేసి రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం జరిగిందని తెలిపారు. ఇందుకు కృషి చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, సిబ్బంది, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులను ఆయన అభినందించారు. అన్ని పథకాల అమలలో ఇదేవిధంగా అధికారులంద రూ టీం వర్క్ చేసి జిల్లాను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని కోరారు. అలాగే ఈనెల 1 నుండి 5 వరకు " స్వచ్ఛ గావ్ సురక్ష జల్ వాయు" కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతున్న దని, ఈ కార్యక్రమ విజయవంథానికి జిల్లా అధికారులందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన "స్వచ్ఛ గావ్ సురక్ష జల్ వాయు" పై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా ఈ నెల 1 నుండి 12 వరకు పర్యావరణ వారోత్సవం నిర్వహించడం జరుగుతున్నదని, ఇందులో భాగంగా జూన్ 1న పర్యావరణంపై అవగాహన కల్పించడం , జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్స వం ,నాలుగున విద్యార్థులకు క్విజ్ కార్యక్రమాల నిర్వహణ, ఐదున పర్యావరణ దినోత్సవం, ఆరున ప్రకృతి కార్యక్రమాల నిర్వహణ, జూన్ 8న మౌలిక సౌకర్యాల కల్పన, 9న కమ్యూనిటీ పర్యావరణ కార్యక్రమాలు, 10న గ్రాస్ రూట్ పర్యావరణ కార్యక్రమాలు, 11న జూ మరియు వన్యప్రాణులు వన దర్శిని కార్యక్రమం, 12న వీటన్నిటిపై సమీక్ష ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి నూతనంగా ప్రవేశపెట్టనున్న ఆరోగ్య కార్డులు, సర్వీస్ రిజిస్టర్ల ఆన్లైన్ అప్డేషన్ కు సంబంధించి అన్ని శాఖల అధికారులు తక్షణమే ఐఎం ఎఫ్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులన్నీ జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కాగా ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 43, ఇతర శాఖలకు 75 మొత్తం 118 ఫిర్యాదులు వచ్చాయి. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ ,జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిఎఫ్ఓ ఎస్. రాజశేఖర్, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై రూపొందించిన గోడపత్రికను, అంతేకాక సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పై రూపొందించిన నూతన నియమాల గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

# పర్యావరణంను పరిరక్షించుకుందాం

**మొదటి పేజీ తరువాయి...**



జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో పర్యావరణ అవగాహన, ప్రకృతి సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అటవీ శాఖ అధికారితో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్ కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యా సంస్థలలో క్విజ్ పోటీలు, పర్యావరణ అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ అవగాహన సదస్సులు, ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనమహోత్సవం, అధిక సాంద్రతతో మిశ్రమ మొక్కల నాటకం, గృహావసర మొక్కల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే మంజీరా వన్యప్రాణి అభయారణ్యం, కమలాపూర్ సరస్సు ప్రాంతాల్లో ప్రకృతి సందర్శన కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా పర్యావరణ హిత ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో విస్తృత స్థాయిలో మొక్కల నాటడం, అటవీ అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మంజీరా పర్యావరణ విద్యా కేంద్రం, అటవీ నర్సరీ, వన దర్శిని కేంద్రాలకు ఎక్స్‌పోజర్ విజిట్లు నిర్వహించి ప్రకృతి, జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జూన్ 12న జరిగే ముగింపు కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు సేవలందించిన స్వచ్ఛంద సంస్థలు,విద్యార్థులు, పాఠశాలలకు, వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతని, జిల్లాలో ప్రజలు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం కోసం కృషి చేస్తామని అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పరిఢవిల్లాలి

**మొదటి పేజీ తరువాయి...**



యువత, విద్యార్థులు మామిడి మొక్కలు నాటి.. నీటిని పోశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

మొక్కలు నాటడంతో ప్రస్తుతంతో పాటు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. పర్యావరణ ఉత్సవాల కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమాల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, ఉద్యానవన శాఖ అధికారి శరత్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# రాష్ట్ర అవతరణ దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

**13వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్**

**ఎస్పీ, ఏర్పాట్లు పూర్తి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**





**నాగర్ కర్నూల్,అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా, పట్టణంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో మంగళవారం 13వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ముఖ్య అతిథి ఉదయం 8:00 గంటలకు  జాతీయ పతాక ఆవిష్కరణ చేస్తారని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. సోమవారం నాగర్కర్నూల్ పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ దేవ సహాయం లతో కలిసి వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంగళవారం నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఉదయం 7:35 గంటలకు జిల్లా ఎస్పీ, 7:45 గంటలకు జిల్లా కలెక్టర్, 7:50 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ తరపున జిల్లా ముఖ్య అతిథి జి. చిన్నారెడ్డి వేడుకల ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు.

ముఖ్య అతిథి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఉదయం 7:52 గంటలకు తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులర్పిస్తారని చెప్పారు. అనంతరం ఉదయం 8:00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, 8:05 గంటలకు పోలీసుల కవాతు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.

ఉదయం 8:15 గంటలకు ముఖ్య అతిథి జిల్లాలో అమలవుతున్న రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం 8:50 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 9:10 గంటలకు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్ సందర్శన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉదయం 9:30 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుందని వివరించారు.

వేడుకలకు వచ్చే ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల కోసం తగిన సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సదుపాయాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమ సమయాలను అనుకూలంగా నిర్ణయించిందని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, మేధావులు, పాత్రికేయులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ కోరారు.

జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ ఆర్డిఓ సురేష్ బాబు, తాహసిల్దార్ తబితా రాణి వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు

# రూ.1.03 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**





**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు  నాయిని రాజేందర్ రెడ్డి  పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 30వ డివిజన్ బాలసముద్రం వెహికల్ షెడ్ ప్రాంతంలో రూ.71 లక్షల వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీనివాస కాలనీలో రూ.32 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, రహదారుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రతి ప్రాంతాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం ఏకాగ్రత పెరుగుతుంది

**క్రీడల్లో గెలుపు ఓటములు సహజం**





**జగిత్యాల అక్షితబ్యూరో:** క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వారి ఆద్వర్యం లో జగిత్యాల జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటు కు కృషి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుంది....ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని జగిత్యాల వివేకానంద మినీ స్టేడియంలో ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్.

ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అసోసియేషన్ సెక్రటరీ దాడి జలపతి, కోశాధికారి రౌతు గంగారెడ్డి, క్రీడాకారులు మరియు ముస్కు నారాయణ రెడ్డి, యం.సుధాకర్ రావు, వి.ప్రభాకర్ రావు, బాల ముకుందం తదితర నాయకులు పాల్గొన్నారు.

## నాగర్కర్నూల్, తాడూరు, తెల్కపల్లి తహసిల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి రూ. 7.63 కోట్ల నిధులు మంజూరు

**ఎమ్మెల్యే డా. కూచకుళ్ల రాజేష్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్కర్నూల్, తాడూరు, తెల్కపల్లి మండలాల తహసిల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం మొత్తం 7.63 కోట్ల రూపాయలు  మంజూరు చేస్తూ నేడు జీవోలు జారీ చేసింది.

ప్రస్తుతం ఉన్న తహసిల్దార్ కార్యాలయ భవనాలు చాలా పాతవి, శిథిలావస్థకు చేరినవి కావడంతో అక్కడ ఆఫీసులు నడపడం కష్టంగా మారింది. దీనివల్ల అటు సిబ్బందికి, ఇటు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను గుర్తించిన నాగర్కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచకుళ్ల రాజేష్ రెడ్డి. నూతన భవనాల నిర్మాణం కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, భవనాల నిర్మాణానికి సంబంధించిన నిధుల మంజూరు ఉత్తర్వులను  జీవోస్ విడుదల చేసింది. తమ నియోజకవర్గ ప్రజల, సిబ్బంది ఇబ్బందులను అర్థం చేసుకుని, నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కి, అలాగే గౌరవ రెవెన్యూ శాఖ మంత్రి కి ఎమ్మెల్యే డా. కూచకుళ్ల రాజేష్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్

**గ్రామాలలో పేద పిల్లల గుర్తిస్తున్న కస్తూరిబా ఉపాధ్యాయులు**






**నాగర్ కర్నూల్  అక్షిత ప్రతినిధి:** గ్రామాలలో వెనుకబడిన పూర్తి నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలను గుర్తించడంలో లింగాల మండలం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఉపాధ్యాయ బృందం గ్రామాలకు చేరుకొని గ్రామంలో తల్లి తండ్రి లేనటువంటి పిల్లలు. లేదా బాల కార్మికులుగా ఉన్న పిల్లలు. బడి మధ్యలో మారివేసిన పిల్లలు. ఇండ్లలోకి వెళ్లి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వారి యొక్క జాబితా సిద్ధం చేస్తున్నారు. కస్తూరిబా గాంధీ పాఠశాలలు వెనుకబడిన విద్యార్థుల కోసమే అని కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్ఓ శారద తెలియజేశారు. సమ్మర్ హాలిడేస్ లో భాగంగా బడిబాట కార్యక్రమం ప్రతి గ్రామంలో నిర్వహిస్తూ మధ్యలో బడి మానివేసిన పిల్లలు, అలాంటి వారికి కస్తూరిబా పాఠశాల అండగా ఉన్నదని గ్రామాలలో ప్రచారం ముమ్మరం చేశారు. బాల బాలికలు చదువుకోవడానికి ఐదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు కస్తూరిబా గాంధీ పాఠశాలలో అవకాశం ఉన్నదని తెలిపారు. ఇలాంటి పిల్లలకు ఎవరికైనా ఉన్నచో మా పాఠశాలలో అడ్మిషన్లు చేసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాలలో ప్రజాప్రతితులు అధికారులు పిల్లల గుర్తిస్తే రాపోర్టు అయినా విద్యార్థులకు ఆ పాఠశాల నుండి ప్రధానోపాధ్యాయుల ద్వారా ధ్రువీకన పత్రం తీసుకురావాలని. అదేవిధంగా గ్రామ. కులం ఆదాయం సర్టిఫికెట్ , గతంలో చదువుకున్న రికార్డు సీట్, బోనఫైడ్, మూడు ఫొటోస్. కులం ఆదాయం సర్టిఫికెట్లు ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ జిరాక్సుతో సాంప్రదించాలని కోరారు.

## బావులలో ఈతకు వెళ్తున్న బాలలు

**తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** బల్మూరు మండల పరిధిలోని ఉన్నటువంటి బావులలో విద్యార్థులు ఈత నేర్చుకునేందుకు వెళ్తున్నారు. కానీ విద్యార్థుల వెంట తల్లిదండ్రులు దగ్గర ఉండి నేర్పించాలి. తల్లిదండ్రులు జాగ్రత్త వహించి పిల్లలను ఒంటరిగా పంపించకుండా జాగ్రత్త తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇటీవల ఎంతమంది పిల్లలు బావులలో స్వేద తెలుసుకోడానికి వెళ్లి మరణించిన సంఘటనలు మనం ప్రతిరోజు కూడా చూస్తూనే ఉన్నాం. పిల్లలను జాగ్రత్త వహించాలని అధికారులు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**పేదవాడి సొంతింటి కల నిజం**

**లింగాల పట్టణ కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశం**

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాస్ రావు**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కు లింగాల సర్పంచి పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య అధ్యక్షతన వారు ముఖ్యఅతిథిగా పాల్గొని ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు మంజూరు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని వారి కళ సొంతం చేసిందని. మండలంలో అన్ని గ్రామాలలో మొదటి విడత ఇందిరమ్మ ఇల్లు 486 మంజూరు కదా అందులో 140 ఇండ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన ఇండ్లు కూడా త్వరలో పూర్తిచేసేటట్లు అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య. మండల ఎంపీడీవో చంద్రశేఖర్. పంచాయతీ కార్యదర్శి మల్లేష్. వార్డ్ మెంబర్లు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రంగాపూర్ గ్రామ పంచాయతీలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రామ్

**డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య**



**అచ్చంపేట అక్షిత ప్రతినిధి:** రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ గారి ఆధ్వర్యంలో అచ్చంపేట మండలం లోని రంగాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ శ్రీరామ్ ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి అని అన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల గురించి, వాటి నుండి ఎలా బయట పడాలో వివరించారు. ఎవరైన ప్రజలు న్యాయ వాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేని వారికి మా సంస్థ తరుపున ఉచితంగా న్యాయ వాదిని నియమిస్తాం అన్నారు. ఇట్టి కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ మూడవత్ బాల్య , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ప్రజల గోడు... అధికారుల దృష్టి ఎటు?

**ప్రజా సమస్యల కంటే అధికారుల ముచ్చట్లకే ప్రాధాన్యతా?**

**ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి**



**నిర్మల్ అక్షిత బ్యూరో,జూన్ 1:** ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం భైంసాలో ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాల మేరకు, సబ్ కలెక్టర్ అజ్మీర్ సంకేత్ కుమార్ ఆధ్వర్యంలో



భైంసా ప్రజావాణి కార్యక్రమంలో కనిపించిన దృశ్యం

నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పెద్దఎత్తున హాజరవుతున్నారు. అయితే, కొందరు అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రజల వినతులకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా వినాల్సిన కొందరు అధికారులు కార్యక్రమం సమయంలో పరస్పర చర్చల్లో నిమగ్నమవడం, ప్రజలు వివరించే అంశాలపై పూర్తి స్థాయిలో స్పందించకపోవడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని వినతిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సంబంధిత శాఖల అధికారులపై నమ్మకం కోల్పోయిన కొందరు బాధితులు నేరుగా సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్‌లకే తమ వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాలే గానీ, కేవలం తంతుగా మారకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించాలని కోరుతున్నారు.

ఈ నేపథ్యంలో ప్రజావాణి నిర్వహణ తీరుపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి, ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## భారతీయ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ (బి ఎం ఎస్ ఆర్ యు) రాష్ట్ర అధ్యక్షుడిగా పప్పుల సురేష్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంఘమైన భారతీయ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ (బి ఎం ఎస్ ఆర్ యు ) రాష్ట్ర అధ్యక్షుడిగా, బిఎంఎస్ నాయకులు పప్పుల సురేష్ నియమితులయ్యారు.కార్మిక ఉద్యమంలో ఆయనకున్న అనుభవం, అంకితభావం,గుర్తిస్తూ సంఘం రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్ ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా పప్పుల సురేష్ మెడికల్ రిప్రజెంటేటివ్‌లు,సేల్స్ రిప్రజెంటేటివ్‌లు , ఫార్మా రంగ ఉద్యోగులు నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని , .పెరుగుతున్న పనిభారం,ఉద్యోగ భద్రత లేకపోవడం, లక్ష్యాల పేరుతో మానసిక ఒత్తిళ్లు,కార్మిక చట్టాల అమలులో లోపాలు వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఉద్యమాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అలాగే "ఉద్యోగుల హక్కుల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యం అన్నారు రాష్ట్రంలోని ప్రతి మెడికల్ మరియు సేల్స్ ఉద్యోగికి (బి ఎం ఎస్ ఆర్ యు )అండగా నిలుస్తుందని , సంఘటిత శక్తితో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన హక్కులను సాధించేందుకు నిరంతరంపోరాడుతామన్నారు. .పప్పుల సురేష్ నియామకంపై రాష్ట్రవ్యాప్తంగా బి ఎం ఎస్ నాయకులు,కార్మిక సంఘ ప్రతినిధులు, మెడికల్ మరియు సేల్స్ రంగ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.ఆయన నాయకత్వంలో(బి ఎం ఎస్ ఆర్ యు )మరింత బలోపేతమై ఉద్యోగుల సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిదంగా ప్రధాన కార్యదర్శి గా సిహెచ్ . రాఘవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గా వి. డిజగదీష్, జాయింట్ సెక్రటరీ గా మహేష్, కోశాధికారి గా క్యాతం శ్రీనివాస్ ఎన్నికయ్యారు.ఈ నియామకానికి సహకరించిన బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్ రాష్ట్ర నాయకులకు వారంతా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

## జులై 5న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కంటి చూపు లేకపోతే అంతా శూన్యమే**

**శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి కాకినాడ వారిచే వియం బంజర్ లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం..**

**కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా సర్జరీ**

**శ్రీరాజసాయి మందిరం సేవా ట్రస్ట్ చైర్మన్ జెన్నారెడ్డి నరసింహా రెడ్డి వెల్లడి..**






**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** శ్రీరాజసాయి మందిరం సేవా ట్రస్ట్,వి.యం బంజర్ వారి ఆధ్వర్యంలో స్వర్గీయ జెన్నారెడ్డి విజయ జ్ఞాపకార్థం శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి కాకినాడ వారిచే జెడ్.పి. హెచ్.ఎస్.స్కూల్,వి.యం.బంజర్ , పెనుబల్లి మండలంలో లిజులై 05 వ తేదీన ఆదివారం రోజు లిమెగా ఉచిత కంటి వైద్య శిబిరంలి ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకు మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన వారికి ప్రముఖ కంటి వైద్యులచే అన్ని రకాల కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా ఇచ్చి, అవసరమైన వారికి ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్ చేయబడుతుంది అని నిర్వాహకులు శ్రీరాజసాయి మందిరం సేవా ట్రస్ట్ చైర్మన్ నీలపు ఉమారాణి మీడియాకు వెల్లడించారు.ప్రైవేట్ హాస్పిటల్లో కంటి శుక్లాల తొలగింపు కోసం ఆపరేషన్ రూ .10000(పది వేల రూపాయల) నుంచి రూ. 12000(పన్నెండు వేల రూపాయలు) తీసుకుంటున్న తరుణంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి కాకినాడ వారు ఉచిత కంటి ఆపరేషన్ మరియు వైద్య సేవలు అందిస్తున్నారు. ఉచితంగా కంటి శుక్లాలు తొలగించబడును అవసరం ఉన్నవారు తమ ఆధార్ కార్డు తీసుకుని ఈ ఉచిత మెగా కంటి మెడికల్ క్యాంపుకు వెళ్ళగలరు అని చైర్మన్ నీలపు ఉమారాణి తెలిపారు.కంటి ఆపరేషన్ అవసరమైన వారికి కాకినాడ బస్సులో ఉచితంగా తీసుకుని వెళ్ళి కంటి ఆపరేషన్ పూర్తి ఐన తర్వాత మళ్లీ అదే బస్సులో తీసుకుని రావడం జరుగుతుంది అని తెలిపారు.వివరాలకు 9866710909 మొబైల్ నంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కేవలం రాజకీయ అంశం కాదు

**ఇది తెలంగాణ ప్రజల రాజ్యాంగబద్ధమైన హక్కులకు సంబంధించిన విషయం**

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**






**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తన వ్యక్తిగత అంశం కాదని, రాజకీయ అంశం అసలే కాదని, ఇది తెలంగాణ ప్రజల రాజ్యాంగబద్ధమైన హక్కులకు సంబంధించిన అత్యంత కీలకమైన విషయం అని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ రోడ్ నం. 12లో ఉన్న కమీషనర్ ఆఫ్ పోలీస్, ఐసీసీసీ కార్యాలయంలో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారుల ఎదుట ఆయన హాజరై తన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న తన మొబైల్ ఫోన్ అనుమానాస్పదంగా ట్యాపింగ్‌కు గురైందని, దీనిపై తొలిసారిగా తాను డిఐజీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం చాలామంది ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కూడా




తమ ఫోన్లు ట్యాపింగ్ జరిగినట్లు ఫిర్యాదు చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాముఖ్యతతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది కేవలం సంభాషణలను వినడమే కాకుండా, ఒక వ్యక్తి వ్యక్తిగత జీవితం, కుటుంబ వ్యవహారాలు, వ్యక్తిగత స్వేచ్ఛలో అక్రమ జోక్యం చేసుకోవడమేనని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి గోప్యత హక్కు కల్పించబడిందని, సుప్రీంకోర్టు పుట్టస్వామి తీర్పు ద్వారా గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే ఆర్టికల్ 19 ప్రకారం భావ ప్రకటన స్వేచ్ఛకు హామీ ఉందని, ఫోన్లు ట్యాప్ అవుతున్నాయనే భయం ఉంటే ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడలేరని అన్నారు. "భయం ఉన్న చోట స్వేచ్ఛ ఉండదు, స్వేచ్ఛ లేని చోట ప్రజాస్వామ్యం ఉండదు" అని ఆయన పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై నిఘా పెట్టడం ప్రజాస్వామ్యంపై దాడితో సమానమని, రాజకీయ పోటీ ప్రజల మధ్య ఎన్నికల్లో జరగాలని, గూఢచర్య మార్గాల్లో కాదని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో నిఘా ద్వారా రాజకీయాలను ప్రభావితం చేసే ప్రయత్నాలపై పూర్తి స్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కేవలం రాజకీయ నాయకులకు మాత్రమే సంబంధించినది కాదని, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు, న్యాయవాదులు, విద్యార్థులు సహా ప్రతి మొబైల్ వినియోగదారుడి హక్కులకు సంబంధించిన అంశమని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమం స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం జరిగిందని, నిఘా రాజ్యం కోసం కాదని స్పష్టం చేశారు. ఈ కేసులో పూర్తి నిజాలు వెలుగులోకి రావాలని, ఎవరు ఆదేశించారు, ఎవరు అమలు చేశారు, ఎంతమంది ప్రభావితులయ్యారు అనే అంశాలపై ప్రజలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ విచారణ ప్రతీకారం కోసం కాదని, రాజ్యాంగ పరిరక్షణ కోసం జరుగుతోందని తెలిపారు. ఈ కేసులో ఎవరి ప్రమేయం ఉన్నా, వారు ఎంతటి ఉన్నత స్థానాల్లో ఉన్నా చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందేనని, ప్రజాస్వామ్యంలో ఎవరూ చట్టానికి అతీతులు కారని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బీసీ సెల్ అధ్యక్షులు దొండి రమణ.....!



**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీసీ సెల్ అధ్యక్షులు దొండి రమణ తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఆరోగ్య సేవల విస్తరణ, ఇందిరమ్మ ఇళ్ల పథకం, మహిళా సంఘాల ఆర్థిక సాధికారత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పన, గ్రామీణాభివృద్ధి ద్వారా తెలంగాణను మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. "అమరవీరుల ఆశయాల సాధనే మన లక్ష్యం... ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం... అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయంతో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్దాం" అని దొండి రమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నాగరాజును ప్రభుత్వం ఆదుకోవాలి

**మలి దశ ఉద్యమంలో వికలాంగుడైన నాగరాజు**

**మారం శ్రీనివాస్, మురళి యాదవ్**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడి, రెండు కాళ్లు, ఒక చేయి కోల్పోయిన మలిదశ ఉద్యమకారుడు నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు, బీసీ జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్, బిసి జెఏసి కో కన్వీనర్ చేగొండి మురళియాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం

మిర్యాలగూడ వచ్చిన పిడమర్తి నాగరాజు కుటుంబాన్ని పరామర్శించారు. మారం శ్రీనివాస్, మురళీ యాదవ్, మారం సుభాషిని శ్రీనివాస్ కలిసి పిడమర్తి నాగరాజును శాలువాతో సత్కరించి మెమెంటో అందజేసీ మారం సుభాషిని శ్రీనివాస్ వ్యక్తిగతంగా కొంత ఆర్థిక సహాయం చేశారు.

శ్రీనివాస్, మురళి యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నాగరాజుకు కొంత ఆర్థిక సాయం చేసింది. కానీ తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. తెలంగాణ కోసం అవయవాలు కోల్పోయి అవిటివాడైన పిడమర్తి నాగరాజు కుటుంబం నేడు దీన పరిస్థితిలో ఉందన్నారు. ఆయన తండ్రి పిడమర్తి ధర్మయ్య పక్షవాతంతో బాధపడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో నాగరాజుకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. త్యాగం చేసిన ఉద్యమకారులను ఆదుకుంటేనే తెలంగాణ సంతోషిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు.

# బిసి నేత పేరుతో వేసిన ఫ్లెక్సీలు దుర్మార్గపు చర్య...

**సమాజాన్ని తప్పుద్రోవ పట్టించాలని చూస్తే ఖబడ్దార్...**

**ఈటల రాజేందర్ ప్రజా నాయకుడు....**

**ఆయనను ప్రజల నుండి విడదీసే దమ్ము ఎవరికి లేదు.....**

**బీసీ సంఘ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బోళ్ళ కరుణాకర్ ధ్వజం.....**



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** తెలంగాణ ఉద్యమ నాయకుడు, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు,బీజేపీ రాష్ట్ర ప్రముఖ నాయకులు.ఈటెల రాజేందర్ పై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దుర్మార్గపు చర్య అని బీసీ సంఘ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బోళ్ళ కరుణాకర్ అన్నారు.రాజకీయంలో అవగాహన లేని వ్యక్తులు రాత్రికి రాత్రే దొంగ చాటుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలను తప్పుద్రోవ పట్టించాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఈ తప్పుడు చర్యను ఖండిస్తున్నట్లు చెప్పారు.సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుదీర్ఘకాలం పాటు శాసన సభ్యులుగా, తెలంగాణ రాష్ట్ర తొలి ఆర్థిక,వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన ప్రజల మద్దతుతో రాష్ట్రంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగాడని వివరించారు. రాజేందర్ ఎదుగుదలను జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులే ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.అట్టి వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.త్వరలో జరగనున్న కేంద్ర ప్రభుత్వ మంత్రి వర్గ విస్తరణలో ఈటలకు స్థానం లభించబోతుందని, కావాలనే సొంత పార్టీ నేతలే ఈ చర్యను ప్రోత్సహించి ఉంటారనే అనుమానం వ్యక్తం చేశారు. ఆయన జీవితం తెలంగాణ సమాజంలో ఓ తెరిచిన పుస్తకం అని,ఆయనపై ఎన్ని ఆరోపణలు వచ్చిన ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.ఇకనైనా వక్రబుద్ధి బుద్ధి కలిగిన ఓ నాయకులరా మున్ముందు బీసీ బిడ్డలపై నిందారోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర జేఏసీ చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్, బీసీ సంఘ రాష్ట్ర నాయకులు ముద్ద బిక్షపతి యాదవ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు బొర్ర విజయ్,జిల్లా నాయకులు పేరాల సాయి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏరిసిస్ సీఈవో జన్మదిన వేడుకలు

### సత్తుపల్లిలో పేదలకు ఉచిత అల్పాహారం పంపిణీ



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ఏరిసిస్ అగ్రో లిమిటెడ్ ఖమ్మం, నల్గొండ, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సీఈవో నల్లపునేని బాబురావు 70వ జన్మదిన వేడుకలు సోమవారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు.ఏరిసిస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి గుండా నర్సింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, బస్ స్టాండ్ సెంటర్ ప్రాంతాల్లో వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలకు ఉచిత అల్పాహారం పంపిణీ చేశారు.సత్తుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో ఏరిసిస్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో జరపడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోగడ రవికుమార్, క్లబ్ నిర్వాహకుడు పసుపులేటి నాగేశ్వరరావు, ఏరిసిస్ సంస్థ ఉద్యోగులు వెంకట్ ,విజయ్, నరేంద్ర , సందీప్, వెంకటేశ్వర్లు, నవీన్ , మనోజ్ , భాస్కర్ సింహరావ్ పాల్గొని పేదలకు అల్పాహారం అందజేశారు. అనంతరం నల్లపునేని బాబురావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

## ఉయ్యాలవాడలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

### మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ ఉదయం ఉయ్యాలవాడలో నిర్వహించనున్న ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, 21వ వార్డు కౌన్సిలర్ పడిగె శంకర్ , 7వ వార్డు ఇన్‌చార్జ్ హర్ష మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు...

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి అర్హ కుటుంబానికి గృహ కలను సాకారం

### నూతన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభించిన ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ మండలం పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమం. మరియు బిజినపల్లి మండలం కుమ్మెర ,గ్రామం లో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా

ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన నివాస సౌకర్యం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు,సర్పంచ్ లక్ష్మికర్ణాకర్ ,ఉప సర్పంచ్ వెంకటయ్య, సర్పంచ్ తుకారాం రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో అస్తవ్యస్తంగా మారిన ట్రాఫిక్

### మూగబోయిన సిగ్నళ్ళు

### కనిపించని పోలీసులు...!



**జయశంకర్ భూపాలపల్లి, అక్షిత బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, జిల్లాల పునర్విభజన తర్వాత జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంగా మారి శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దీనికితోడు జిల్లా కేంద్రం గుండా వెళ్లే జాతీయ రహదారి ( నేషనల్ హైవే-353జ) పై రోజురోజుకూ వాహనాల రద్దీ గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో, పట్టణంలో అత్యంత కీలకమైన అంబేద్కర్ సర్కిల్ వద్ద నలువైపులా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అధికారులు అత్యాధునిక సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే, గత మూడు రోజులుగా ఈ సిగ్నల్ వ్యవస్థ పూర్తిగా మూగబోవడంతో పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ తప్పి తీవ్ర గందరగోళం నెలకొంది. గతంలో ఇక్కడ సిగ్నల్ వ్యవస్థ సజావుగా నడిచినప్పుడు వాహనాలను క్రమబద్ధీకరించడానికి, నిబంధనలు ఉల్లంఘించే వారికి చలాన్లు విధించడానికి పదుల సంఖ్యలో ట్రాఫిక్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేవారు. కానీ, గత మూడు రోజులుగా ఇక్కడ విధులు నిర్వహించాల్సిన ట్రాఫిక్ పోలీసులు కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదు. సిగ్నళ్లు పని చేయకపోవడం, మరోవైపు ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో నాలుగు వైపుల నుండి వాహనాలు ఒకేసారి సర్కిల్‌లోకి దూసుకువస్తున్నాయి, ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



**పుష్కరాల విధులు, అకాల వర్షమే కారణం: ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్..**

జిల్లా కేంద్రంలో నెలకొన్న ఈ ట్రాఫిక్ సమస్యపై స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ ని అక్షిత న్యూస్ వివరణ కోరగా..జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న 'సరస్వతి పుష్కరాల' బందోబస్తు విధులకు జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ సిబ్బందిని పెద్ద సంఖ్యలో కేటాయించాల్సి వచ్చింది. దీనివల్ల ఇక్కడ తాత్కాలికంగా సిబ్బంది కొరత ఏర్పడిందని, గత మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం, వీచిన గాలి దుమారం కారణంగా అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక అంతరాయం ఏర్పడిందని సిగ్నల్ వ్యవస్థకు త్వరలోనే మరమ్మతులు చేయించి, పుష్కరాల విధులు ముగియగానే సిబ్బందిని తిరిగి ఇక్కడ అందుబాటులో ఉంచి ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.



# నాణ్యమైన బోధనకు గీతం ప్రోత్సాహం

### ఫిజిక్స్ అధ్యాపకుల శిక్షణ ప్రారంభోత్సవంలో గీతం అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు





**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:** భౌతికశాస్త్ర ఉపాధ్యాయులను నాణ్యమైన శిక్షణతో ప్రోత్సహించి, ఆ రంగాన్ని అభివృద్ధి చేయాలనే విద్యాపరమైన బాధ్యతగానే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు స్పష్టీకరించారు. 'అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల వృత్తి వికాస కార్యక్రమం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ (ఐపీఏ) విశాఖపట్నం విభాగం సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, భౌతికశాస్త్ర రంగంలోని ప్రముఖ నిపుణుల నుంచి అధునాతన భావనలు, ఆచరణాత్మక అనువర్తనాలను నేర్చుకోవడానికి లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మూడు రోజుల కార్యక్రమ స్వరూపాన్ని గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ బి.వి.ఆర్. టాటా వివరిస్తూ, ఉదయం సైద్ధాంతిక చర్చలు, భోజనానంతరం ఆచరణాత్మక శిక్షణ ఉండేలా ఈ కార్యక్రమాలను రూపొందించామని తెలిపారు. పలువురు విద్యా నిపుణులు తమ జ్ఞానం, అనుభవాలను పంచుకుంటారని చెప్పారు.గీతం సైన్స్ డీన్ ప్రొఫెసర్ అనంత రామకృష్ణ మాట్లాడుతూ, భౌతికశాస్త్రం అత్యంత ఆకర్షణీయమైన విషయాలలో ఒకటని, అంతిమ జ్ఞానానికి పునాదిగా అభివర్ణించారు. సైన్స్ ఆర్థిక విజయానికి దారితీయదనే (టెకీల వలె బాగా సంపాదించలేము) సాధారణ అపోహను ప్రస్తావిస్తూ, శాస్త్రీయ జ్ఞానం ద్వారా ఆర్థిక విలువను సృష్టించడంలో పేటెంట్ చట్టాలు, ఆవిష్కరణలు, ఉత్పత్తి అభివృద్ధి యొక్క ప్రాముఖ్యత ఆయన వివరించారు. విద్యార్థులు సైన్స్ విద్యను ఆర్థికంగా అర్థవంతంగా మార్చాల్సిన అవసరాన్ని ఆయన ఉద్ఘాటించారు. అనంతరం, ఇందులో పాల్గొంటున్న వారిలో ఉత్సుకతను రేకెత్తించేందుకు, శాస్త్రీయ ఆవిష్కరణలో ముడిపడి ఉన్న ఆచరణాత్మక సమస్యలు, పారిశ్రామిక అనువర్తనాలు, ఆర్థిక విలువను ప్రదర్శిస్తూ, 'విద్యుదయస్కాంతత్వం: కొన్ని నిజ జీవిత అనువర్తనాలు' అనే అంశంపై ఆయన తొలి సాంకేతిక కార్యక్రమాన్ని నిర్వహించారు.గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లో అందుబాటులో ఉన్న విద్య, పరిశోధనా సౌకర్యాలను డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా పరిచయం చేశారు. ముఖ్యంగా, అంతర్విభాగ పరిశోధనకు కేంద్రంగా పనిచేసే మల్టీడిసిప్లినరీ యూనిట్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ ల్యాబ్స్ ను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గీతం హైదరాబాదు ప్రాంగణంలోని అధునాతన ప్రయోగశాలలను సందర్శించాలని ఈ శిక్షణలో పాల్గొంటున్న వారందరినీ ఆయన ఆహ్వానించారు.ఐఐటీ మద్రాసు భౌతికశాస్త్ర విభాగం నుంచి పదవీ విరమణ చేసిన ఆచార్య నటరాజన్, గీతం విశిష్ట ఆచా ర్యుడు, సెంటర్ ఫర్ ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ కు చెందిన ప్రొఫెసర్ జి.రవికుమార్ తన అనుభవాన్ని పంచుకున్నారు. మంగళవారం (రెండవ రోజున) ఐఐఎస్సీ బెంగళూరు భౌతికశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ ఆచార్య విభోర్ సింగ్, భాభా అణు పరిశోధనా సంస్థ (బార్క్) పూర్వ శాస్త్రవేత్త జి.ఏ.రామారావు ఉపన్యసించనున్నారు. మరో రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ శిక్షణా కార్యక్రమాన్ని డాక్టర్ జి.సాయిప్రీతి, డాక్టర్ టి.విశ్వం సమన్వయం చేస్తున్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

**సోమశిల, నార్లాపూర్, ఉయలవాడ ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించిన**

**భద్రత, బస, హెలిప్యాడ్, సమీక్షా సమావేశ ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల సందర్శన నిమిత్తం ఈ నెల 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపడుతోంది. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సోమశిల, నార్లాపూర్ ప్రాంతాలతో పాటు నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని ఉయాలవాడ ప్రాంతాలను సందర్శించి ముందస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదట సోమశిలలోని హరిత గెస్ట్ హౌస్‌ను సందర్శించిన అధికారులు, ముఖ్యమంత్రి బస చేయనున్న గదులు, సమావేశ మందిరాలు, విశ్రాంతి సదుపాయాలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్షా సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పరిశీలించారు. హరిత గెస్ట్ హౌస్ పరిసర ప్రాంతాలు, ప్రవేశ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, సమావేశ ప్రాంగణంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ రాకపోకల దృష్ట్యా ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ స్థలాన్ని కూడా పరిశీలించిన అధికారులు, అక్కడ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకల నిర్వహణకు సంబంధించిన చర్యలపై సూచనలు చేశారు. హెలిప్యాడ్ నుంచి పర్యటన ప్రాంతాలకు వెళ్లే రహదారుల మరమ్మతులు, శుభ్రత పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నార్లాపూర్‌లోని పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్యాకేజీ--3 పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి ఈ పర్యటనలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ స్టేజ్--3 పనులను ప్రత్యక్షంగా పరిశీలించనున్న నేపథ్యంలో అక్కడి పనుల పురోగతి, సందర్శన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తెలంగాణ రాష్ట్రంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టులలో ఒకటిగా ఉన్నందున, ప్రాజెక్టు పనుల పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఉయాలవాడలో నూతనంగా నిర్మించిన నీటిపారుదల శాఖ కార్యాలయ సముదాయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడి హెలికాప్టర్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. అనంతరం కుమ్మెర ప్రాంతంలోని పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌సీ పార్థసారథి, ఆర్డీఓ బన్సీలాల్, నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్‌బాబు, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ మాధవి, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# సమస్యలు పరిష్కరించాలి

**తహసీల్దార్ కార్యాలయం ముందు ఎంసీపీఐయు నల్లగొండ జిల్లా కమిటీ ధర్నా**

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ఎంసీపీఐయు కేంద్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడ తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి తహసిల్దార్ పి.శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ ఎంసీపీఐయు జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి మాట్లాడుతూ సామాన్య ప్రజలపై భారీ ఆర్థిక భారాన్ని మోపి చమురు కంపెనీలకు ప్రయోజనం చేకూర్చే పెట్రోల్ డీజిల్ సహాయం వాయువు, ఎరువుల ధరల పెంపును ఉపసంహరించుకోవాలని అన్నారు నిరుద్యోగం మరియు ద్రవ్యోల్బణన్నీ నియంత్రించాలని నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అందించాలని పేదవారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు అమెరికా ప్రతిపాదన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద నుండి వ్యవసాయ ఉత్పత్తుల పాడి




ఉత్పత్తులు పండ్లు మరియు కూరగాయలను మినహాయించాలని కనీస మద్దతు ధర ఎంఎస్పీకు చట్టబద్ధ హోదా కల్పించాలని, డాక్టర్ స్వామినాథన్ ఫార్ములా సీ 2 ప్లస్  శాతం ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేసేలా హామీ ఇస్తూ పండ్లు, కూరగాయలతో సహా అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు కనీసం మద్దతులను ప్రకటించాలన్నారు కనీసం మద్దతు ధర కంటే తక్కువ చేసే ఏ కొనుగోలు నైనా శిక్షార్హమైన నేరంగా పరిగణించాలన్నారు వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ సీఏ, సీపీలను చట్టబద్ధ సంస్థగా మార్చాలన్నారు కార్మికులకు రైతులు 60 ఏండ్లు నిండిన తర్వాత నెలకు 20,000 చొప్పున ఇచ్చి సామాజిక భద్రత కల్పించాలన్నారు. రాజ్యాంగ ప్రాథమిక హక్కులను పరిరక్షించి, రాజకీయ లబ్ధి కోసం ఈడి, సిబిఐ, ఇతర సంస్థలను దుర్వినియోగం చేయడాన్ని అరికట్టాలన్నారు. నీట్ పేపర్ లీక్, సీబీఎస్సీ మూల్యాంకన కుంభకోణాలపై సంబంధిత మంత్రి రాజీనామా చేసేలా ఆదేశించి దోషులను శిక్షించాలని, గ్రామీణ వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు పెరిగిన వేతనాలతో కూడిన ప్రతిష్టకర ఎన్జీ ఆర్ఈజీఏస్ ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఉత్తర ప్రదేశ్ పారిశ్రామిక ప్రాంతాలలో ఆయన డిమాండ్ల కోసం నిరసన తెలిపిన కార్మికులను వేధించకుండా వారికి న్యాయం జరగాలన్నారు. ఇరాన్ వెనిజులపై అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణ, క్యూబాపై దాడి చేస్తామన్న బెదిరింపులను ఖండించాలన్నారు. కార్యక్రమంలో ఎంసిపిఐయు జిల్లా నాయకులు భరత్ కిరణ్  ఆశీర్వాదం  పుల్లయ్య రామకృష్ణ సైదులు శేఖర్ వెంకటయ్య యాదగిరి సైదులు ఇమ్మానుయేల్ మారయ్య పుల్లయ్య కోటేష్ ఐజాక్ జోసఫ్ లు పాల్గొన్నారు.

## పంట వ్యర్థాలను కాల్చవద్దు..






**జయశంకర్ భూపాలపల్లి, అక్షిత బ్యూరో :** వానాకాలం దుక్కులకు ముందు రైతులు పొలాల్లోని వ్యర్థాలను తొలగించుకోవాలే తప్ప, వాటికి మంట పెట్టడం అస్సలు శ్రేయస్కరం కాదు. రోటవేటర్ సహాయంతో కలియదున్నడం ప్రస్తుతం రైతులు వరి పంటను హార్వెస్టర్ల ద్వారా కోయడం వల్ల పొలాల్లో పెద్ద ఎత్తున కొయ్యలు మిగిలిపోతున్నాయి. వాటిని కాల్చకుండా రోటవేటర్ సహాయంతో పొలంలోనే కలియదున్ని నీరు పెట్టాలి. ఇలా చేయడం వల్ల ఆ కొయ్యలు మట్టిలో కలిసి త్వరగా కుళ్ళిపోతాయి. ప్రత్యామ్నాయ మార్గాల వినియోగం పంట వ్యర్థాలను వృధాగా తగలబెట్టకుండా క్రింది ప్రత్యామ్నాయ మార్గాల్లో ఉపయోగించుకోవాలని తెలిపారు. సహజ సిద్ధమైన పోషకాలు: వ్యర్థాలు మట్టిలో కుళ్ళడం వల్ల నేలకు సేంద్రియ కర్బనం, నైట్రోజన్ (నత్రజని) వంటి పోషకాలు సహజ సిద్ధంగా అందుతయని నేల ఆరోగ్యం ఇది నేల యొక్క నీటిని పట్టి ఉంచే సామర్థ్యాన్ని (తేమను), భూమిలో గాలి ప్రసారాన్ని పెంచి పెట్టుబడి తగ్గుతుందని,నేల సారవంతం కావడం వల్ల తర్వాతి పంటకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గి, రైతులకు పెట్టుబడి వ్యయం ఆదా అవుతుందని పేర్కొన్నారు..

**విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినే ప్రమాదం...: కాటారం విద్యుత్ శాఖ  ఏ.ఈ ఉపేందర్**

వ్యవసాయ భూముల్లో పంట అవశేషాలు, గడ్డి, చెత్తకు మంటలు పెట్టడం వల్ల సమీపంలో ఉన్న విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం కలగడమే కాకుండా, అగ్ని ప్రమాదాలు మరియు ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉంది. ప్రత్యేకంగా ఎండాకాలంలో మంటలు వేగంగా వ్యాపించే అవకాశం ఉండటంతో రైతులు అత్యంత జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ లైన్ల కింద లేదా సమీపంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మంటలు పెట్టకూడదు. ప్రజలు మరియు రైతులు విద్యుత్ భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను నివారించడంలో సహకరించాలని తెలిపారు.

## ఇందిరమ్మఇళ్ళను ప్రారంభించిన సర్పంచ్ కొమ్మగోని రాజేశ్వరిరవిగౌడ్



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహవసతి కల్పించాలనే ఉద్దేశ్యం తో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారుప్రవేశపెట్టిన ఇందిరమ్మఇళ్ళ పథకం ద్వారా ఎమ్మెల్యే  కసిరెడ్డి నారాయణరెడ్డిసార్ గారు మరియు నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీడవిజిలెన్స్ కమిటీ మెంబర్ జిల్లెల్ల రాములు సహకారంతో గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళను సర్పంచ్ కొమ్మగోని రాజేశ్వరిరవిగౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతిగౌడ్,ఉపసర్పంచ్ ఎముక రవి,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముచ్చర్ల శ్రీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు తాడేం మౌనిక మల్లయ్య,గుమ్మకొండ నాగమణి మహేందర్, డొక్కు చెన్నమ్మజంగయ్య, చిక్కొండ పద్మఆంజనేయులు,నాప శ్రీశైలం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాప మల్లయ్య, వీరెడ్డి నర్మదరాజేశ్వర్ రెడ్డి, చిక్కొండ పార్వతమ్మ బీరయ్య, హనుమాన్ దేవాలయ వైస్ చైర్మన్ వీరెడ్డి శ్యామ్ సుందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎముక శ్రీహరి,కుమ్మరి శ్రీరాములు, చిక్కొండ శివలతో పాటు ఇందిరమ్మ ఇళ్ళలబ్దిదారులు మరియు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY

# జీవితాంతం గుర్తుంచుకుంటాం ఓటేసి రుణం తీర్చుకుంటాం

**కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలియజేసిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు**

**వనపర్తి మండలం కడుకుంట్లలో 22 ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలకు హాజరైన ఎమ్మెల్యే**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** తాము ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొన్నామని పూరి గుడిసెల్లో ఉంటూ, మట్టి మిద్దెల్లో ఉంటూ, రేకుల షెడ్డుల్లో ఉంటూ వర్షం కురుస్తున్న కవర్లు కప్పుకుని పిల్లలను తడవకుండా చూసుకున్న రోజులు నేడు గుర్తొస్తున్నాయి సార్ అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు సోమవారం ఉదయం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కడుకుంట్ల గ్రామంలో నూతనంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించు కొని గృహప్రవేశాలు చేపట్టిన 22 మంది లబ్ధిదారుల ఇళ్ల గృహప్రవేశాలకు వెళ్లి వారికి నూతన వస్త్రాలను అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత తాము బాగుపడతామని భావించామన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇళ్లను గ్రామాలలో కట్టించి ఇస్తారని పదేళ్లుగా కళ్ళల్లో వత్తులు వేసుకొనీ ఎదురు చూసామని వాపోయారు. అయినా ఏ ఒక్కరికి ఒక్క ఇల్లు రాలేదని ఎన్నో హామీలు చెప్పిన నాయకులు నమ్ముకున్న ప్రజలను మోసం చేశారే తప్ప అండగా నిలువ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలోనే 50 ఇండ్లు మంజూరయ్యాయని అందులో 36 ఇల్లు పూర్తయ్యాయని, మరో 14 ఇండ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే ప్రొసీడింగ్లలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడం నాడైనా నేడైనా కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేదలు ఉండకూడదని వచ్చే సంవత్సరం వరకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నారని ఆయనను కలకాలం గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారుల ఇల్లకు వెళ్లిన ఎమ్మెల్యే దంపతులకు నూతన వస్త్రాలను అందించి అభినందనలు తెలియజేశారు. తమ సొంత ఇంటి కల నెరవేర్చిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి, రాష్ట్ర ముఖ్యమంత్రి కి లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెంకటేష్, వనపర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవికిరణ్, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త డంప్ యార్డ్ ప్రతిపాదనను రద్దు చేయాలి...

**సబితా ఇంద్రా రెడ్డి**

**సిద్దాపూర్ నుండి పాదయాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి**




**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్న చెత్త డంప్ యార్డు ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం సిద్దాపూర్ గ్రామం నుండి కలెక్టరేట్ వరకు చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ షాద్ నగర్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు భారీగా పాదయాత్రతో బయలుదేరారు. చలో కలెక్టరేట్ పాదయాత్రకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.... బి ఆర్ ఎస్ హయాం లో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందాలు నడిపిస్తుందన్నారు. ఏ భూముల్లో ఏ పరిశ్రమలు నెలకొల్పాలో ఏ భూముల్లో చెత్త డంప్ యార్డులు తీసుకురావాలో సీఎం రేవంత్ రెడ్డి కి కనీస అవగాహన లేదన్నారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దాపూర్ ప్రాంతంలో ఐటీ పార్కు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం సేకరించిన 350 ఎకరాల భూమిలో ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చెత్త డంప్ యార్డ్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ చెత్త డంప్ యార్డ్ వల్ల చుట్టుపక్కలోని గ్రామాలకు ప్రజలకు పశువులకు అనేక సమస్యలు తలెత్తుతాయని, పర్యావరణ కాలుష్యంతో పాటు పరిసరాలు దెబ్బతింటాయని, వెంటనే డంప్ యార్డ్ ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## రైలు ఢీకొని ఇద్దరు యువతులు మృతి





**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** సికింద్రాబాద్ నుండి బయలుదేరిన రైలు ఢీకొని ఇద్దరు మృతి చెందినట్లు రైల్వే పోలీస్ మల్లేష్ తెలిపారు.

రంగారెడ్డి జిల్లా నందిగామ గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం హంద్రీ ఎక్స్ ప్రెస్ ఢీ కోనడంతో ప్రీతి ( 22 ), కుమారి(15) ఇద్దరు యువతులు మృతి చెందారు. నందిగామ శివారులో కట్టెలమోపుతో రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందినట్లు తెలిపారు. గాయాల పాలైన వారిని చికిత్స కోసం అంబులెన్స్లో షాద్ నగర్ కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతులు ప్రీతి తండ్రి పింటూ సేలంపూర్ గ్రామం, భోజ్ పూర్ జిల్లా కుమారి తండ్రి సంజయ్, పుట్టాయి గ్రామం, దర్ బంగా జిల్లా బీహార్ రాష్ట్రం కు చెందినవారు వీరి కుటుంబాలు గత 8 ఏళ్లుగా నందిగామలో వలస కూలీలుగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. మృతురాలు కుమారి 8వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన సర్పంచ్





**వలిగొండ/ అక్షిత న్యూస్:** వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా 45 ఇండ్లు మంజూరయ్యాయి వాటిలో మొదటగా నాలుగు ఇండ్లు పూర్తికావడంతో సోమవారం రోజున వాటిని గ్రామ సర్పంచ్ వేముల అనూష కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనూష మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద ప్రజల సొంత ఇల్లు కలలను సాకారం చేయడం ఆనందంగా ఉందన్నారు.గ్రామ గ్రామంలో ఈ పథకానికి ప్రజలు చూపుతున్న ఆదరణ పై కాంగ్రెస్ పార్టీ తరపున గర్వంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలు అమలు చేస్తూ పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జోగు సైదులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జక్క దామోదర్ రెడ్డి గ్రామశాఖ అధ్యక్షులు బుగ్గ వెంకటేష్ , వార్డు మెంబర్లు కనుగొంటి పాండు, సిల్వేరు మహేష్, పర్వతం సంతోష,వేముల అనిత, వేముల నాగరాజు, దొడ్డి స్వర్ణలత,పిన్నింటి ఉమారాణి, కంచి శ్రీధర్,ఇందిరమ్మ కమిటీ చైర్మన్, కొమ్మిడి వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు, ఉపాధ్యక్షులు వాకిటి సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, బుగ్గ మనోజ్ బుగ్గ మల్లయ్య, బుగ్గ బీరప్ప, మెరుగు కృష్ణ, పర్వతం రాజు, బంధారపు నరేష్ , తదితరులు పాల్గొనడం జరిగింది.

## విధి నిర్వహణ రాణిస్తే గుర్తింపుతో పాటు రివార్డులు వస్తాయి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**





**వరంగల్, అక్షిత బ్యూరో:** విధి నిర్వహణలో రాణించే సిబ్బంది శాఖపరమైన గుర్తింపుతో పాటు రివార్డులు వస్తాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సిబ్బంది సూచించారు. వరంగల్ కమిషనరేట్ కార్యాలయములో పోలీస్ సిబ్బంది శాఖపరమైన సమస్యలపై పోలీస్ అధికారులు ఏర్పాటు చేసిన దర్బార్ కార్యక్రమములో వరంగల్ పోలీస్ కమిషనర్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ముందుగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నీజాయితోతో పనిచేయాలని, శిక్షణ సమయంలో నేర్చుకున్నదే కోనసాగించాలని, ప్రభుత్వం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులని, కావున పోలీసులు చేసే ప్రతి పని ప్రజలు గమనిస్తారని, అదే విధంగా ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం అధికంగా వుందని. దీని కారణంగా పోలీసులు తప్పు చేసిన, చేయకున్న సోషల్ మీడియా ద్వారా పోలీసుల వ్యతిరేకంగా ప్రచారం జరుగుతుందని. ఇది దృష్టిలో వుంచుకోని ప్రతి పోలీస్ అధికారి జాగ్రత్తగా పనిచేయాలని. నిరంతరం కష్టపడి విధులు నిర్వర్తించడమే కాకుండా చేసే విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని లేకుంటే ప్రజల్లో పోలీసుల పట్ల తప్పుడు సంకేతాలు పోతాయని. మీకు ఎద్దైన శాఖపరమైన లేక వ్యక్తిగత సమస్యలు వుంటే తన దృష్టి రావాలని, వీలైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతం ఖైదీల ఎస్కాట్, ఇంక్రీమెంట్లు, విశ్రాంతి గదులుతో పాటు పలు శాఖపరమైన సమస్యలు పోలీస్ సిబ్బంది పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుక వెళ్ళారు. ఈ సమావేశంలో అదనపు డిసిపిలు రవి, సురేష్కుమార్, శ్రీనివాస్,ఏసిపి నాగయ్య, అంతయ్య, సురేంద్ర,పరిపాలధికారి సంపత్ కుమార్ ఆర్.ఐలు సర్వర్జన్ రాజ్, సతీష్,శ్రీధర్, చంద్రశేకర్, సూపరింటెండెంట్లు యాకుబ్ బాబా, సంధ్య, వహిద్ పాషా, గిరితో పాటు ఆర్.ఎస్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.